సాక్షి అనకాపల్లి

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



గంగారావు క్రైమ్ కథా చిత్రం.!

తహసీల్దార్ హత్య కేసు నిందితుడి క్రైమ్ చిట్టా పెద్దదే.. సినిమాలోనే కాదు.. గంగారావు నిజ జీవితంలోను విలనే..! 8లో



భారీ అన్నదానం

విశాఖ: ఫిషింగ్ హార్బర్‌లో రాజ్యశ్యామల అమ్మవారి యజ్ఞం, గంగా హారతి సందర్భంగా బుధవారం భారీ అన్నదానం చేశారు.



వేడుకగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్యకల్యాణాన్ని బుధవారం వేడుకగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

విశాఖ టు అబుదాబి

పయనమైన ఇంగ్లండ్ క్రికెటర్లు



విశాఖ విమానాశ్రయం టెర్మినల్ లోపలికి వెళ్తున్న ఇంగ్లండ్ క్రికెటర్లు

గోపాలపట్నం: ఇంగ్లండ్ క్రికెటర్లు బుధవారం విశాఖ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఉదయం 7.30 గంటలకు బస్సుల్లో విమానాశ్రయానికి చేరుకున్న క్రికెటర్లు.. ప్రత్యేక విమానంలో నేరుగా అబుదాబి వెళ్లారు. వైఎస్సార్ స్టేడియంలో భారత్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో ఆ జట్టు ఓటమి పాలైన సంగతి తెలిసిందే. రాజ్‌కోటలో ఈ నెల 15 నుంచి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ మధ్య సమయాన్ని అబుదాబిలో గడపడానికి పర్యాటక జట్టు పయనమైంది. భారీగా తరలివచ్చిన అభిమానులు ఇంగ్లండ్ క్రికెటర్లకు వీడ్కోలు పలికారు. విమానాశ్రయంలోకి వెళ్తున్న సమయంలో వారిని తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఎగబడ్డారు.

21 నుంచి పారా స్విమ్మింగ్ పోటీలు



గోడపత్రిక విడుదల చేసిన కలెక్టర్

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ పోటీలు ఈనెల 21 నుంచి రైల్వే అక్వా స్పోర్ట్స్‌లో జరగనున్నాయి. పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.మల్లికార్జున తన చాంబర్‌లో పోటీల గోడపత్రికను విడుదల చేశారు. పారా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధి బృందం పాల్గొన్నారు.

ఏయూకి ఐపీ ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ పురుషోత్తం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఐపీ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో 5వ ఐపీ ఎక్స్‌లెన్స్ అవార్డును అసోచాం అందించగా.. ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం ఈ అవార్డును స్వీకరించారు. మేధో హక్కుల రంగంలో చేస్తున్న విశేష కృషిని గుర్తిస్తూ అసోచాం ఈ అవార్డును ప్రదానం చేసిందని డాక్టర్ పురుషోత్తం తెలిపారు. ఏయూ ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో 125 పేటెంట్‌లు దరఖాస్తు చేశామని.. వీటిలో ఆరు పేటెంట్‌లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిని త్వరలో వాణిజ్యీకరణ చేసే దిశగా ఆలోచన చేస్తున్నట్లు వివరించారు.

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ నిర్మాణానికి స్థల పరిశీలన



విలేకరులతో మాట్లాడుతున్న అటవీశాఖ సీసీఎఫ్ శ్రీకంఠనాథ్‌రెడ్డి, జెన్‌కో అధికారులు

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు ప్రాంతంలో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతి ఇచ్చేందుకు స్థల పరిశీలన చేస్తున్నామని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ప్రాజెక్టుకు అవసరమైన అటవీ స్థలాన్ని జెన్‌కో అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ అటవీ సంపదకు ఎటువంటి నష్టం జరగకుండా ప్రాజెక్ట్ నిర్మాణానికి అటవీశాఖ అనుమతి ఇస్తుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి 215 హెక్టార్లు అవసరం ఉందన్నారు. ఇందులో అటవీ భూమి ఉన్నందున అనుమతికోసం జెన్‌కో అధికారులు దరఖాస్తు చేశారన్నారు. దీనిలో భాగంగానే సర్వే చేపడుతున్నామన్నారు. అటవీ సంపదకు, వన్యప్రాణులకు ఎటువంటి నష్టం లేకుండా ఉండేలా ప్రణాళిక తయారు చేసి ఇస్తామన్నారు. ఇందుకు అవసరమైన ఖర్చును, ప్రత్యామ్నాయ భూమిని జెన్‌కో కేటాయిస్తుందని తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి డీపీఆర్‌లో నాలుగు చోట్ల పొందుపరిచిన స్థలాన్ని పరిశీలించినట్టు చెప్పారు.

ఏలేరు కాలువ పటిష్టంతో ప్రమాదాలకు చెక్

- రూ 10 కోట్లతో క్రాష్ బారియర్ నిర్మాణానికి చర్యలు
- ప్రయోగాత్మకంగా ఇప్పటికే రెండు చోట్ల నిర్మాణాలు
- ఐదు ప్రాంతాల్లో ఫుట్‌పాత్ వంతెనలు



ఏలేరు కాలువలో ప్రవహిస్తున్న నీరు



ఎ.శరభవరం వద్ద నిర్మించిన క్రాష్ బారియర్

నాతవరం: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీరు సరఫరా చేస్తున్న ఏలేరు కాలువను పటిష్టపరచడమే కాకుండా, కాలువ వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. నేషనల్ హైవేపై నిర్మించే మాదిరిగా క్రాష్‌బారియర్(రెయిలింగ్) నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా రెండు చోట్ల నిర్మించగా, ఏలురు కాలువ పొడవునా మరో 1500 మీటర్ల మేర నిర్మాణం, ఇతర అభివృద్ధి, మరమ్మతు పనులకు తాజాగా ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈనిధులతో విస్కో, ఏలేశ్వరం ప్రాజెక్టు జలవనరుల అధికారులు సంయుక్తంగా పనులు చేయనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి విశాఖపట్నం వరకు 154 కిలో మీటర్ల పొడవున ఏలేరు కాలువ ప్రవహిస్తోంది. ఈకాలువ ద్వారా రోజుకు 300 క్యూసెక్కుల నీరు తరలిస్తుంటారు. విశాఖపట్నం ప్రజలకు తాగునీటి అవసరాలకు, పలు పరిశ్రమల నీటి అవసరాలు తీర్చేందుకు ఏలేరు కాలువను ఏర్పాటు చేశారు. ఈకాలువ ప్రవహించే ప్రాంతాల్లో తరుచూ ప్రమాదాలు జరగడంతో పాటు వర్షాలు కురిసే సమయంలో రైతులు వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు ఇబ్బందిగా మారింది. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో 20 మండలాల్లో ఏలేరు కాలువ ప్రవహిస్తోంది. ఆయా మండలాల్లో కాలువ గట్టుపై ప్రజలు రాకపోకలు సాగించడంతో పాటు రైతులు వ్యవసాయోత్పత్తులు తరలిస్తుంటారు. ప్రమాదకరంగా ఉన్న పలు ప్రాంతాల్లో ఏలేరు కాలువ వద్ద క్రాష్ బారియర్ నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. మొదటిగా ప్రయోగాత్మకంగా ఎ.శరభవరం, రాజుపేట అగ్రహారం గ్రామాల వద్ద రూ.10 లక్షల వ్యయంతో 200 మీటర్ల మేర నిర్మించారు. మరో 1500 మీటర్ల మేర పలు ప్రాంతాల్లో త్వరలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. వీటితో పాటు ఏలేరు కాలువ 29 కిలో మీటరు, 57 కిలో మీటరు వద్ద తుపానుకు దెబ్బతిన్న ప్రాంతాలను రూ.కోటి వ్యయంతో పటిష్టం చేయనున్నారు. రెండు జిల్లాల పరిధిలో ఐదు చోట్ల ఫుట్ పాత్ వంతెనలు నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. తాండవ, శారదా, వరాహ నదుల పరీవాహక ప్రాంతాల్లో రైతులు వ్యవసాయోత్పత్తులు తరలించేందుకు, రాకపోకలు సాగించేందుకు ఏలేరు కాలువపై గ్రోయిన్ల వద్ద సిమెంటు పనులు చేయనున్నారు. ఈవిధంగా చేయడం వల్ల కాలువ గట్టుపై తుపాన్ల సమయంలో సైతం ఆయా ప్రాంతీయులు రాకపోకలు సాగించేందుకు ఎలాంటి సమస్య ఉండదు.

రూ.4.50 కోట్లతో మరమ్మతులు

రూ.4.50 కోట్లతో 154 కిలో మీటర్ల పొడవున పూడిక తీత, కాలువ మరమ్మతులు, ఏడాది పొడవున నిర్వహణ పనులు చేయనున్నారు. ఈ పనులను మూడు రీచ్‌లుగా విభజించారు, రీచ్ ఒక్కంటికి 50 కిలో మీటర్లు పొడవున రూ.1.50 కోట్లతో టెండర్లు పక్రియ పూర్తి చేసి, కాంట్రాక్టర్‌కు అగ్రిమెంటు పూర్తి చేశారు. పూడి తీత పనులు రక్షణ గోడ నిర్మాణం పనులు త్వరలో చేపట్టనున్నారు.

నీరు వృథా కాకుండా పటిష్ట చర్యలు



ఏలేరు కాలువలో నీరు వృథాగా పోకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఏలేరు కాలువపై నిత్యం వాహనాలు తిరిగేందుకు పలు చోట్ల సిమ్మెంటు పనులు చేస్తాం. ప్రమాదాలు జరిగే చోట క్రాష్ బారియర్ నిర్మిస్తున్నాం. వేసవిలో నీటిని సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాం. కాలువలో పూడిక తీతతో పాటు ఏడాది పొడవున కాలువ మరమ్మతులు, అత్యవసర పనుల నిర్వహణ కోసం రూ.4.50 కోట్లతో ఇటీవల టెండర్లు ప్రకియ పూర్తి చేశాం.

– నానాజీ, ఏలేరు కాలువ జేఈ

బ్లాక్ స్పాట్లలో భద్రతా చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, చిత్రంలో ఎస్పీ మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్

- ఆధునిక సాంకేతికతో రోడ్డు ప్రమాదాల నివారణ
- ట్రాఫిక్ నిబంధనలపై అందరికీ అవగాహన
- రోడ్డు సేఫ్టీ మీటింగ్‌లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం

సాక్షి, అనకాపల్లి: ఆధునిక సాంకేతికత సాయంతో ప్రమాదాల నివారణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రహదారి భద్రతా కమిటీతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జియో మ్యాప్ ద్వారా జాతీయ, రాష్ట్ర, ఇతర రహదారులపై ఎక్కడెక్కడ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయో.. ఆ ప్రదేశాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి అక్కడ ముందస్తుగా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. అనకాపల్లి–అచ్యుతాపురం, అచ్యుతాపురం– రాంబిల్లి, అచ్యుతాపురం– యలమంచిలి రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు రోడ్డు ప్రమాదాలు నివారణకు లైట్లు లేని చోట్ల కొత్తవి త్వరితగతిన వేయాలని ఆదేశించారు. ఆనందపురం– అనకాపల్లి, అనకాపల్లి– రాజమహేంద్రవరం జాతీయ రహదారుల్లో కొక్కిరాపల్లి, రేగుపాలెం, లంకెలపాలెం, పులపర్తి, పురుషోత్తపురం, ఉమ్మలాడ, నరసింగపల్లి ప్రాంతాల్లో సిగ్నళ్ల లైటింగ్ మరింత మెరుగుపరచాలన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్టులను ఉపయోగించేలా పోలీసు, రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు అక్కడ లోపాలను త్వరితగతిన గుర్తించి వాటిని పునరుద్ధరించాలని ఆదేశించారు. ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ.. పోలీసు, రవాణా శాఖ సమన్వయంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ తగిన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్ల పరిస్థితులు గురించి ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన మరమ్మతులు చేయించాలన్నారు. అంతకుముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల పరిరక్షణకు సంబంధించి జిల్లా రవాణా అధికారి ప్రకాష్ రావు వివరాలను తెలియజేశారు. అనకాపల్లి జిల్లా నేషనల్ హైవేపై, స్టేట్ హైవేలపై బ్లాక్ స్పాట్‌లకు ఇతర రోడ్డులపై రోడ్డు ప్రమాదాలకు కారణమైన కొన్ని ట్రాఫిక్ కూడళ్లను జియో మ్యాప్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్, అనకాపల్లి, పరవాడ డీఎస్పీలు సుబ్బరాజు, సత్యనారాయణ, డీపీటీవో కె.పద్మావతి, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేష్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, ఎంవీ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హత్య కేసులో నిందితుడు అరెస్టు



నిందితుడు శేఖర్ (ఫైల్)

నర్సీపట్నం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై విష ప్రయోగం చేసి చావుకు కారణమైన ప్రియుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ కాంతికుమార్ తెలిపారు. ఆరేళ్లుగా ప్రేమిస్తున్న రుత్తల రత్నమాధురిని నాతవరం మండలం వెన్నలపాలేనికి చెందిన వాసురెడ్డి శేఖర్ బయటకు తీసుకువెళ్లి విషం ఇవ్వడంతో వారం రోజులు మృత్యువుతో పోరాడి బాధితురాలు ప్రాణా లు కోల్పోయిన విషయం తెలిసిందే. మృతురాలు తల్లి అమ్మాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శేఖర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం శేఖర్ పెద్దలను తీసుకొచ్చి లొంగిపోవడంతో అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

అనకాపల్లి బరిలో నాగబాబు?

- ఎంపీగా పోటీ చేసే ఆలోచన
- గెలుపోటములపై కేడర్‌తో సమాలోచనలు
- పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాల్లో పర్యటన



నర్సీపట్నంలో మాట్లాడుతున్న నాగబాబు

నక్కపల్లి: జనసేన నాయకుడు, పవన్ కల్యాణ్ సోదరుడు నాగేంద్రబాబు అనకాపల్లి ఎంపీగా పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీనిలో భాగంగా అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి పార్టీ పరిస్థితిని తెలుసుకునేందుకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆయన పాయకరావుపేట నియోజకవర్గం నుంచి పర్యటన ప్రారంభించారు. నియోజకవర్గ కేడర్‌తో సమావేశం నిర్వహించారు. నాగబాబు అనకాపల్లి జిల్లా పర్యటనతో ఎంపీగా పోటీ చేస్తారన్న ఊహాగానాలకు బలం చేకూరుతోంది. 2009లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించినపుడు ఆయన బావమరిది, సినీ నిర్మాత అల్లు అరవింద్ అనకాపల్లి ఎంపీగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి సబ్బం హరి చేతిలో 52 వేల ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అరవింద్ మూడో స్థానంలో నిలిచారు. 2019లో అనకాపల్లి నుంచి జనసేన తరఫున చింతల పార్థసారథి పోటీ చేసి సుమారు 82 వేల ఓట్లు మాత్రమే సాధించారు. ఇప్పుడు టీడీపీ తరఫున అనకాపల్లి ఎంపీ టికెట్ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కొడుకు చింతకాయల విజయ్‌తోపాటు వ్యాపారవేత్త బైరా దిలీప్ చక్రవర్తి ఆశిస్తున్నారు. అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయంటూ అన్ని నియోజకవర్గాల్లో మద్దతు కూడగడుతున్నారు. జనసేనలో చేరుతానని ప్రకటించిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ వీరిద్దరికీ చెక్ పెట్టడానికి.. అనకాపల్లి నుంచి నాగబాబే పోటీ చేస్తే బాగుంటుందని సలహా ఇచ్చినట్టు సమాచారం. అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తే ఎలా ఉంటుందనే అంశంపై బేరీజు వేసుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పాయకరావుపేట టికెట్ జనసేనకు కేటాయించాల్సిందే..

ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో పాయకరావుపేట టికెట్ జనసేనకే కేటాయించాలని పార్టీ నాయకులు కోరారు. నాగబాబు బుధవారం పాయకరావుపేట మండలం గుంటపల్లి వచ్చారు. పార్టీ సీనియర్ నేత గెడ్డం బుజ్జి ఇంటి వద్ద కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గెడ్డం బుజ్జి మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన బలంగా ఉందన్నారు. సీటు టీడీపీకి కేటాయించి అభ్యర్థిగా వంగలపూడి అనితను నిర్ణయిస్తే మద్దతు ఇచ్చే ప్రసక్తి లేదన్నారు. కేడర్ కూడా ఒప్పుకోవడం లేదన్నారు. జనసేనకు ఇక్కడ విజయావకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల జనసేనలోని మరో వర్గం అనితకు అనుకూలంగా వ్యవహరించడాన్ని గెడ్డం బుజ్జి పరోక్షంగా విమర్శించారు. నాగబాబు మాట్లాడుతూ జనసేన నాయకులు పొత్తు ధర్మం పాటించాలన్నారు. నియోజకవర్గ కార్యకర్తల అభిప్రాయాలు, ఆవేదన పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ ఎ.లక్ష్మీ శివ కుమారి, పార్టీ సీనియర్ నాయకుడు సుందరపు సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎక్కడ నుంచి పోటీ చేసేది త్వరలోనే పవన్ ప్రకటిస్తారు

నర్సీపట్నం: పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎక్కడ నుంచి పోటీ చేసేది త్వరలోనే ప్రకటిస్తారని జనసేన నాయకుడు కె.నాగబాబు పేర్కొన్నారు. బుధవారం జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈసారి పవన్ ఉత్తరాంధ్ర నుంచి పోటీ చేస్తారా అని విలేకరులు ప్రశ్నించగా.. ఆ విషయం కొద్ది రోజుల్లో ప్రకటిస్తారని చెప్పారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

దిశ ఎస్‌వోఎస్‌కు కాల్ చేసిన మహిళ

- 15 నిమిషాల్లోనే చేరుకున్న పోలీసులు
- ఏటికొప్పాక ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

యలమంచిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిన దిశ ఎస్‌వోఎస్ యాప్ ఆపదలో చిక్కుకున్న ఎందరో మహిళలకు రక్షణగా నిలుస్తోంది. తాజాగా ఏటికొప్పాకకు చెందిన మహిళ అచ్యుతాపురం బ్రాండిక్స్ పరిశ్రమలో విధులు ముగించుకుని మంగళవారం రాత్రి తన గ్రామంలో బస్సు దిగి ఇంటికి వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పల్లా చిరంజీవి వెంబడించాడు. ఈ క్రమంలో ఆమె తన ఇంటికి వెళ్లి తలుపు వేసుకుంది. ఆ తర్వాత బుధవారం వేకువజామున తలుపు తీయాలంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు దిశ ఎస్‌వోఎస్‌కు కాల్ చేసి సహాయం కోరింది. వెంటనే అప్రమత్తమైన దిశ టీం యలమంచిలి రూరల్ పోలీసులను సంఘటనా స్థలానికి పంపించింది. రూరల్ ఎస్సై పైల సింహాచలం, సిబ్బంది కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే ఫోన్ లొకేషన్ ఆధారంగా చేరుకుని రక్షణగా నిలబడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఐపీసీ సెక్షన్లు 448, 509 కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్టు తెలిసింది.

ముగ్గురు సీఎంల పాలనకు దర్పణం

- 'మూడు దారులు' పుస్తక పరిచయ సభలో మాజీ వీసీ బాలమోహన్‌దాస్
- వాస్తవాల ఆవిష్కరణకే ఈ పుస్తక రచన: దేవులపల్లి అమర్



మాట్లాడుతున్న రచయిత, సీనియర్ పాత్రికేయుడు అమర్

సీతంపేట: ముగ్గురు ముఖ్యమంత్రుల పాలన చరిత్రకు 'మూడు దారులు' పుస్తకం ప్రతీకగా నిలుస్తుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ రచించిన మూడు దారులు పుస్తక పరిచయ సభ బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలను జర్నలిస్టులు ప్రభావితం చేస్తారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను వీసీగా విధులు నిర్వహించినప్పటి సంఘటనలు గుర్తు చేసుకున్నారు. సామాజిక విలువలు పాటిస్తూ పుస్తకం రాసిన రచయిత అమర్ అభినందనీయులన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఏయూ జర్నలిజం విభాగం విశ్రాంత ప్రధానాచార్యులు ప్రొఫెసర్ పి.బాబీవర్ధన్ మాట్లాడుతూ పాత్రికేయుడు అమర్ రాసిన మూడు దారులు పుస్తకంపై పీహెచ్‌డీ చేయవచ్చన్నారు. సాధారణంగా చరిత్ర, జీవిత కథలను రాస్తూ ఉంటారని, అందుకు భిన్నంగా ముగ్గురు ముఖ్యమంత్రుల పాలన చరిత్రను అమర్ రాశారన్నారు. ప్రముఖ పాత్రికేయుడు మంగు రాజగోపాల్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎప్పటికప్పుడు సమాజంలోని రాజకీయ పరిణామాలకు అప్‌డేట్ అవ్వాలని, వారిలో అమర్ ముందుంటారన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల పరిపాలనను స్వయంగా చూసిన అమర్ ఈ పుస్తకం రాశారని తెలిపారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి పుస్తకాన్ని సమీక్షిస్తూ చరిత్రను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందని.. ఈ పుస్తకం ద్వారా అమర్ తన బాధ్యత నెరవేర్చారన్నారు. అధికారం కోసం ఆనాడు చంద్రబాబు.. ఎన్టీఆర్‌ను వెన్నుపోటుకు సైతం వెనుకాడని సంఘటన పుస్తకంలో సాక్షాత్కరిస్తుందన్నారు.

ఆధారాలతో వాస్తవాల ఆవిష్కరణ

పుస్తక రచయిత అమర్ మాట్లాడుతూ దక్షిణాదివారిని ఉత్తరాదివారు పట్టించుకోరని, మద్రాసీయులుగా పిలిచే తెలుగు వారిని ఆంధ్రులుగా ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారన్నారు. వైఎస్సార్, చంద్రబాబు ఒకేసారి రాజకీయాల్లోకి వచ్చారని, 1983 వరకు ఒకే పార్టీలో కలసి ప్రయాణించారన్నారు. 1983లో ఓడిపోయిన తర్వాత చంద్రబాబు టీడీపీలో చేరి.. తర్వాత కాలంలో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. 2011, 2014 ఎన్నికల్లో బీజేపీ, ఆ తర్వాత జనసేన మద్దతుతో పోటీ చేశారని, ఏనాడూ ఒంటరిగా చంద్రబాబు గెలవలేదన్నారు. వైఎస్సార్ మాత్రం మొదటి నుంచి చివరి వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగారన్నారు. వీరిద్దరికీ భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదిగారని తెలిపారు. తండ్రి మరణం వల్ల చనిపోయిన అభిమానులను ఓదార్చడానికి కాంగ్రెస్ అధిష్టానం అడ్డుపడటం, దాంతో బయటకు వచ్చి పార్టీని స్థాపించడం, ఈడీ కేసులతో 16 నెలలు జైలుకి వెళ్లడం, వీటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని.. 2019లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. తాను వైఎస్సార్‌కు సన్నిహితమని గానీ, సీఎం జగన్ పాలనలో సలహాదారుడిగా పని చేశానని గానీ వారికి అనుకూలంగా, చంద్రబాబుకి వ్యతిరేకంగా ఈ పుస్తకం రాయలేదన్నారు. ఆధారాలతో వాస్తవాలు ఆవిష్కరించినట్లు చెప్పారు. ఈ పుస్తకం చదివితే అన్ని వాస్తవాలు తెలుస్తాయన్నారు. అనంతరం రచయితను ఘనంగా సత్కరించారు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన స్థాయీ సమావేశంలో 80 అజెండా అంశాలతో పాటు 61 టేబుల్ అజెండాలతో కలిపి 141 అంశాలు పొందుపరిచారు. స్థాయీ సభ్యులు వీటిని చర్చించి ఆమోదించారని మేయర్ తెలిపారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి పలు ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు తొలగింపునకు రూ.3.85 లక్షలు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి పలు వార్డుల్లో తాత్కాలిక పద్ధతిపై అదనపు పారిశుధ్య కార్మికుల నియామకం, కాపులుప్పాడకు వ్యర్థాలు తరలించేందుకు రూ.3.20 కోట్లు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రూ.21.63కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యదర్శి పి.నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

యాంపీ థియేటర్ పరిశీలన

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సభా స్థలి కోసం అన్వేషణ



వీసీ ప్రసాదరెడ్డితో చర్చిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఏయూక్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖ పర్యటన నేపథ్యంలో ఆంధ్రా యూనివర్సిటీలోని కె.వి.గోపాలస్వామి యాంపీ థియేటర్‌ను బుధవారం కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున పరిశీలించారు. వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీపీ మణికంఠ, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలసి అక్కడ పరిస్థితులను సమీక్షించారు. ఆడుదాం–ఆంధ్రా ముగింపు సందర్భంగా పీఎంపాలెంలోని క్రికెట్ స్టేడియం, ఏయూలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. థియేటర్ సామర్థ్యం, ప్రవేశం, బయటకు దారి మార్గాలు, సభ ఏర్పాటు తదితర అంశాలపై వారితో చర్చించారు. కార్యక్రమ నిర్వహణ సాధ్యాసాధ్యాలపై కలెక్టర్ సమీక్షించారు.

క్రీడాకారులకు చక్కని ఏర్పాట్లు

మధురవాడ, ఆనందపురం: ఆడుదాం ఆంధ్రా పోటీలకు వివిధ జిల్లాల నుంచి విశాఖ వచ్చే క్రీడాకారులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా వసతి ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. క్రీడాకారుల వసతి కోసం కేటాయించిన మధురవాడ సుద్దగెడ్డ, దబ్బందలోని టిడ్కో ఇళ్ల సముదాయాలను బుధవారం ఆర్డీవో భాస్కరరెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నగరంలో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు ఐదు క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుద్దగెడ్డ వద్ద సుమారు 1,400 మంది మహిళా క్రీడాకారులకు, దబ్బందలో సుమారు 1,600 మంది పురుష క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులు నిద్రించేందుకు మ్యాట్స్ మొదలు మరుగుదొడ్లు, పరిశుభ్రత, ఆయా గదులకు గడియారాలు, లైటింగ్, భోజనం, రవాణా, భద్రత తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. ఆయా పనుల బాధ్యత తీసుకున్న అధికారులు ఏ విధమైన లోటుపాట్లు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. కారిడార్, కాలనీలో కూడా లైటింగ్, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్డీసీ పద్మలత, జెడ్పీలు డి.లక్ష్మి, కనక మహాలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఆర్ఐ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శభాష్ వలంటీర్



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛను అందజేస్తున్న వలంటీర్ సుప్రియ

పాయకరావుపేట: అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి వలంటీరు పింఛన్ అందజేశారు. పాయకరావుపేట పట్టణంలోని బృందావన్‌కాలనీకి చెందిన దాసం వెంకటరావు కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని సచివాలయం-1 పరిధికి చెందిన వలంటీరు సుప్రియ 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేజీహెచ్‌కి ఈనెల 5వ తేదీన వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌కు వెంకటరావు కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వంతో అంతదూరం ప్రయాణించి పెన్షన్ అందజేసిన ఆమెను పలువురు ప్రశంసించారు.

నిరుద్యోగులను మోసగించిన అన్నదమ్ములపై చీటింగ్ కేసు

చోడవరం రూరల్: తాము పనిచేస్తున్న ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పలువురు నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన అన్నదమ్ములపై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. చోడవరానికి చెందిన కసిరెడ్డి రమణమూర్తి, అతని సోదరుడు మోహన్‌బాబులు డాక్‌యార్డ్, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వేయిస్తామని చెప్పి తన వద్ద నుంచి రూ.4 లక్షలు 2021 నవంబర్‌లో తీసుకున్నారని, ఉద్యోగం లేకపోగా తాను చెల్లించిన సొమ్మును తిరిగి ఇవ్వడం లేదని సోమవారం నిర్వహించిన స్పందనలో కలెక్టర్‌కు పట్టణంలోని నాడు వీధికి చెందిన డోకల మోహనరావు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు తమ కార్యాలయానికి ఫిర్యాదుదారుని పిలిపించుకుని విచారణ చేపట్టినట్టు సీఐ చెప్పారు. మరికొంత మంది నుంచి కూడా ఉద్యోగాల పేరు చెప్పి ఆ అన్నదమ్ములు లక్షలలో వసూళ్లు చేసినట్టు తెలిసిందన్నారు. ఇలా సుమారు రూ.30 లక్షలు వసూలు చేసిన ఇద్దరు అన్నదమ్ములపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బుధవారం తెలిపారు.

గంగారావు క్రైమ్ కథా చిత్రం..!



- సినిమాలోనే కాదు.. గంగారావు నిజ జీవితంలోను విలనే..!
- తహసీల్దార్ హత్య కేసులో నిందితుడి క్రైమ్ చిట్టా పెద్దదే..
- మూడేళ్ల క్రితం 'ది నైట్' పేరుతో సినిమా తీసిన గంగారావు
- డబ్బులు ఇవ్వకపోవడంతో సినిమా నుంచి తప్పుకున్న డైరెక్టర్
- స్వీయ దర్శకత్వ అవతారమెత్తి విలన్‌గా చేసిన గంగారావు
- అందులో హీరోయిన్‌ను రాడ్‌తో కొట్టినట్టే తహసీల్దార్‌ను కొట్టి చంపిన హంతకుడు
- గతంలో రోడ్డు కాంట్రాక్టు ఇప్పిస్తానని హైదరాబాద్‌లో ఒక వ్యక్తికి రూ.1.5 కోట్లు టోకరా
- వాటర్ ప్లాంట్ పేరుతో విజయవాడలో రూ.40 లక్షలు మోసం
- తవ్వే కొద్దీ బయటపడుతున్న గంగారావు అక్రమాలపై కథనం

విశాఖ సిటీ: తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో నిందితుడు మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు క్రైమ్ కథా చిత్రంలో కొత్త ట్విస్టు వెలుగులోకి వచ్చింది. మూడేళ్ల క్రితం థియేటర్లలో విడుదలకు నోచుకోని ఒక సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా తీసినట్లు తేలింది. ఆ సినిమాకు గంగారావే ప్రొడ్యూసర్.. డైరెక్టర్.. విలన్ పాత్రలు కూడా పోషించాడు. ఇదిలా ఉంటే.. ఆ సినిమాలో హీరోయిన్‌ను రాడ్‌తో కొట్టి చంపినట్టే అచ్చం తహసీల్దార్ రమణయ్యను కూడా కొట్టి హత్య చేయడం గమనార్హం. సినిమాలో చేసిన పాత్రను యథాతథంగా నిజజీవితంలో చేసినట్లు స్పష్టమవుతోంది. అలాగే ఇతగాడి క్రైమ్ చిట్టా చాలా పెద్దదే అన్నట్లు తెలుస్తోంది. ఒక్కో చోట ఒక్కో అవతారం ఎత్తి వ్యాపారులు, రియల్టర్లను రూ.లక్షలు, రూ.కోట్లకు ముంచేశాడు. అక్కడ కేసుల్లో చిక్కుకొని చివరకు విశాఖకు చేరుకొని ఇక్కడ కూడా అదే పంథాలో వెళ్లి చివరకు తహసీల్దార్‌ను హత్య చేశాడు.

సినిమాలో చంపినట్లే..

మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు మూడేళ్ల క్రితం 'ది నైట్' అనే క్రైమ్ థ్రిల్లర్ సినిమా తీశాడు. దీనికి అతడు ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాడు. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన సునీల్‌కు డబ్బులు ఇవ్వకపోవడంతో అతడు ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడు. దీంతో గంగారావు డైరెక్టర్ అవతారమెత్తాడు. అంతేకాకుండా ఆ సినిమాలో విలన్ పాత్ర పోషించాడు. ఈ సినిమాలో ఒక సన్నివేశంలో విలన్‌గా నటించిన గంగారావు హీరోయిన్ తలపై రాడ్డుతో కొడతాడు. అదే తరహాలో తహసీల్దార్ రమణయ్యను కూడా అపార్ట్‌మెంట్ సెల్లార్ తలపై రాడ్డుతో కొట్టి చంపాడు. సినిమాలో నటించిన మాదిరిగానే నిజ జీవితంలో కూడా హత్య చేయడం గమనార్హం.

క్రైమ్ చిట్టా పెద్దదే..

గంగారావు ఒక్కో ప్రాంతంలో ఒక్కో అవతారం ఎత్తి అక్కడి వారిని మోసం చేసి జిల్లాలు మారుకుంటూ విశాఖకు వచ్చాడు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో గంగారావు పెద్ద వ్యాపారవేత్తగా, ఆర్థికంగా స్థితిమంతుడిగా, అక్కడి ప్రభుత్వ పెద్దలతో మంచి సత్సంబంధాలు ఉన్నట్లు కలరింగ్ ఇచ్చేవాడు. ఈ క్రమంలో పత్తిపాటి రవి అనే వ్యక్తికి రోడ్డు కాంట్రాక్ట్ ఇప్పిస్తానని చెప్పి రూ.1.5 కోట్లకు టోకరా వేశాడు. దీనిపై రవి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో చీటింగ్ కేసు నమోదైంది. ఆ తరువాత గంగారావు హైదరాబాద్‌లో దుకాణం సర్దేసి విజయవాడకు మకాం మార్చాడు. అక్కడ కూడా పలుకుబడి ఉన్నట్లు చెప్పుకుంటూ భవానీపురం ప్రాంతానికి చెందిన విరూపాక్ష అనే వ్యక్తికి వాటర్ ప్లాంట్ పేరుతో రూ.40 లక్షలకు మోసం చేశాడు. సదరు బాధితుడు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విజయవాడలో మరో కేసు నమోదైంది. ఆ జిల్లా నుంచి మకాం మార్చి విశాఖకు చేరుకున్నాడు. ఇక్కడ మధురవాడలో జ్యూయల్ అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా నివాసముంటున్నాడు.

పీకల్లోతు అప్పుల్లో..

మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అతడి మోసాలు, అప్పులు, వారి వేధింపులతో విసిగిపోయిన భార్య విడాకులు ఇచ్చేసి దూరంగా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. గంగారావుకు సుమారు రూ.4 నుంచి రూ.5 కోట్లు వరకు అప్పులు ఉన్నట్లు సమాచారం. అలాగే అతడి ఇంటిపై రుణం తీసుకొని తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు వారు ఇంటిని స్వాధీనం చేసుకొని వేలం వేసినట్లు పోలీసులు గుర్తించారు. ఒక వైపు ప్రతి ప్రాంతంలోను ఎవరో ఒకరిని మోసం చేసి రూ.కోట్లకు టోకరా వేసిన గంగారావు అంత అప్పుల్లో కూరుకుపోవడానికి గల కారణాలు ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

ఇక్కడ ఎన్‌ఆర్‌ఐలతో ఒప్పందం

విశాఖకు వచ్చిన గంగారావు రియల్టర్ అవతారమెత్తాడు. ఒక ఆఫీస్ తెరిచి పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారిగా అందరినీ పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఏడుగురు ఎన్‌ఆర్‌ఐలకు సంబంధించిన కన్వేయన్స్ డీడ్స్ చేయిస్తానని నమ్మించాడు. రూ.లక్షలకు వారితో ఒప్పందం చేసుకొని అడ్వాన్స్ కూడా తీసుకున్నాడు. ఆ పని కోసమే తరచూ విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లేవాడు. ఈ వ్యవహారంలో కార్యాలయంలో కొంత మేర నగదు లావాదేవీలు కూడా జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. తహసీల్దార్ కార్యాలయంలో ఎవరెవరికి ఎంత మొత్తంలో డబ్బు ఇచ్చాడన్న విషయాన్ని గంగారావు ఒక డైరీలో రాసుకున్నట్లు సమాచారం. అయితే తహసీల్దార్ ఆ పనిచేయలేదు. ఇక్కడి నుంచి విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ అయ్యారు. ఒకవైపు ఎన్‌ఆర్‌ఐల నుంచి ఒత్తిడి ఉండడంతో గంగారావు తహసీల్దార్‌పై కోపంతో హత్య చేశాడు.

నేవీ ప్రహరీ పనులు అడ్డుకున్న వై.లోవ గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

రాంబిల్లి: నేవీ ప్రహరీ పనులను బుధవారం వై.లోవ గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామంలో ఇళ్ల, మరిడితల్లి అమ్మవారి గుడి... ప్రహరీ లోపలకు వెళ్లకుండా గోడ నిర్మించాలని సర్పంచ్ బద్ది నారాయణరావుతో పాటు గ్రామస్తులు డిమాండ్ చేస్తూ పనులు అడ్డుకున్నారు. తహసీల్దార్ బి.అప్పలస్వామి, సీఐలు లక్ష్మణరావు, దీనబంధు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చలు జరిపారు. నేవీ పనులకు ఆటంకం కల్గించవద్దంటూ సూచించారు. దీనిపై తహసీల్దార్ అప్పలస్వామి విలేకరులతో మాట్లాడుతూ, ప్రహరీ బయట గుడి ఉండేలా ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నామన్నారు. అయితే గ్రామంలో ఇళ్లకు ఇబ్బంది లేకుండా ప్రహరీ నిర్మాణం తమ పరిధిలో కాదన్నారు. నేవీ ఉన్నతాధికారుల నుంచి దీనిపై క్లారిటీ రావాలన్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న స్థలాలను నేవీకి అప్పగించడం జరిగిందని ఆయా స్థలాల్లో ప్రహరీ నిర్మిస్తున్నారని తహసీల్దార్ పేర్కొన్నారు.

18 కిలోల గంజాయి పట్టివేత

కె.కోటపాడు: కారులో తరలిస్తున్న 18 కిలోల గంజాయిని ఎ.కోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో వారాడ కూడలి వద్ద పట్టుకున్నట్టు ఎస్‌ఐ జె.రమేష్ తెలిపారు. బుధవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో హైదరాబాద్‌కు చెందిన నరేంద్ర తుకారాం చిట్టి అనే వ్యక్తి వారాడ గుండా కొత్తవలస మార్గంలో కారులో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. కారును సీజ్ చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- ప్రయోగ పరీక్షలకు 150 కేంద్రాల ఏర్పాటు
- విద్యార్థుల సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ కేంద్రం
- ప్రాక్టికల్స్ పేరుతో డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు
- ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రాంతీయ తనిఖీ అధికారి మురళీధర్

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రాంతీయ తనిఖీ అధికారి(ఆర్‌ఐవో) పి.మురళీధర్ పేర్కొన్నారు. బుధవారం విశాఖ కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి పరీక్షల వివరాలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 11 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 1 నుంచి 15 వరకు ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా ఫస్టియర్ థియరీ పరీక్షలకు 40,873 మంది, సెకండియర్ పరీక్షలకు 41,806 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. ప్రాక్టికల్స్‌కు ఎంపీసీ కోర్సు విద్యార్థులు 32,982 మంది, బైపీసీ కోర్సు విద్యార్థులు 4,945 మంది హాజరుకానున్నారన్నారు. థియరీ పరీక్షలకు జిల్లాలో 93 పరీక్షా కేంద్రాలు, ప్రాక్టికల్స్‌కు 150 కేంద్రాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఆయా రోజుల్లో ఉదయం, మధ్యాహ్నం జరుగుతాయన్నారు. థియరీ పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.




ఇంటర్ పరీక్షల నిర్వహణ వివరాలను వెల్లడిస్తున్న ఆర్‌ఐవో మురళీధర్

హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు

విద్యార్థుల సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఐవో మురళీధర్ చెప్పారు. ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే 0891-2567561 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా హాల్‌టికెట్ మంజూరు చేయాలన్నారు. ప్రాక్టికల్స్ కోసం ప్రత్యేక రుసుం వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం 0891-2567561 హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఈవో ఎల్.చంద్రకళ, డీవీఈవో రాధ, ఆర్‌ఐవో కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్, డీఎంహెచ్‌వో, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్ ఆర్టీసీ, పోస్టల్, పోలీస్, విద్యా శాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ సౌరభం.. అభివృద్ధి పథం

- అన్ని వర్గాలకు సమాన కేటాయింపులతో మెప్పించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- హర్షాతిరేకాలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని ప్రతి గడపకూ అభివృద్ధి ఫలాలు అందించాలన్న లక్ష్యంతో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అహర్నిశలు శ్రమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ అదే తీరు కనబరిచింది. సుపరిపాలన ఆంధ్ర, సామర్థ్య ఆంధ్ర, సంపన్న ఆంధ్ర, మన మహిళా మహారాణుల ఆంధ్ర, సంక్షేమ ఆంధ్ర, సంపన్న ఆంధ్ర, అన్నపూర్ణ ఆంధ్ర అంశాలు ఆధారంగా ఇంద్ర ధనస్సులాంటి బడ్జెట్‌ని రూపకల్పన చేసి.. అన్ని వర్గాలను మెప్పించింది. ప్రతి అంశం ప్రగతి కోసం.. ప్రతి అడుగూ ప్రజల కోసం.. ప్రతి పైసా సంక్షేమం కోసం.. ప్రతి నిర్ణయం అభివృద్ధి కోసం అన్న రీతిలో రూపొందించిన పద్దు.. జనామోదం పొందింది. మహిళల ఆర్థిక, సామాజికాభివృద్ధికి పెద్దపీట వేస్తూ.. అన్నదాతలకు భరోసా కల్పిస్తూ.. పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తూ.. సంక్షేమ పథకాలతో ప్రతీ ఒక్క రంగానికి వెన్నుదన్నుగా ప్రభుత్వం ఉంటుందని ఈ బడ్జెట్‌లో స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ద్రవ్యలోటు నియంత్రించడం అభినందనీయం



అంబేడ్కర్ ఆశయాలే మార్గదర్శకాలుగా.. బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా.. ఏ వర్గాన్నీ విస్మరించకుండా ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అద్భుతంగా ఉంది. ఆర్థిక మాంద్య పరిస్థితుల్లో ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త కీన్స్ సూచించిన ఆర్థిక విధానాలు, వినూత్న పథకాలను అమలు చేసి ఫలితాలు రాబట్టే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. సంక్షేమానికి ఖర్చు చేస్తూనే ఎఫ్ఆర్‌బీఎం చట్టం(ద్రవ్య లోటు నియంత్రణ చట్టం) నిబంధనలకు లోబడి ద్రవ్య లోటును నియంత్రించడం అభినందనీయం. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, వ్యవసాయం, విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేసింది.

– ప్రొ.లజపతిరాయ్, డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ మాజీ వీసీ

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా..



ఓటాన్ బడ్జెట్ కేవలం స్వల్ప కాలానికే ప్రతిపాదిస్తారు. రెగ్యులర్ బడ్జెట్‌కి దీనికి కొంత వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ ప్రధానంగా సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధి లక్ష్యంగా చేసుకుని కేటాయింపులు చేశారు. బలహీన వర్గాలను దృష్టిలో ఉంచుకుని తయారు చేసిన బడ్జెట్‌గా ఇది స్పష్టమవుతోంది.

– ఆచార్య పి.విశ్వనాథం, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం, ఏయూ

విద్యార్థులు సంయమనం పాటించాలి

కొమ్మాది(విశాఖ): నవోదయ విద్యార్థులు సంయమనం పాటించాలని, అందరూ అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయలో సోమవారం జరిగిన ర్యాగింగ్ ఘటనపై ఆయన స్పందించారు. నవోదయకు బుధవారం చేరుకుని ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. గొడవకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ కుటుంబ సభ్యులుగా మెలగి మంచి వాతావరణం సృష్టించాలని సూచించారు. గొడవలు పడి కేసులు నమోదైతే జీవితం ఛిద్రమవుతుందని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. చట్టాలపై పిల్లలకు అవగాహన కలిగించాలని సూచించారు. యాజమాన్యం పొరపాటు ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనపై నవోదయ, జిల్లా విద్యాశాఖ, పోలీసులు నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గౌరీశంకర్, చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఖలీషా బేగం ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న సీతారామ్

గాయపడిన వ్యక్తి మృతి

యలమంచిలిరూరల్: స్థానికఅల్లూరి సీతారామరాజు కాలనీకి చెందిన కోట్ని సత్తిబాబు(44) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. సత్తిబాబు గత నెల 24వ తేదీన పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా పెదపల్లి రైల్వే గేటుకు సమీపంలో యానాద్రి అమ్మవారి ఆలయం వద్ద సిమెంటు రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో చేర్పించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య జ్యోత్స్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

40 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్ట్

రావికమతం: మరుపాకలో సారా అమ్ముతున్న ఇద్దర్ని అరెస్టు చేసి, వారి నుంచి 40 లీటర్లు స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్‌ఐ ధనంజయ్ తెలిపారు. గ్రామంలో సారా విక్రయాలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు బుధవారం దాడులు చేసి, ఇద్దర్ని అరెస్టు చేసినట్టు చెప్పారు.అలాగే గామ శివారు పొలాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3 వేల లీటర్ల పులుపును, పరికరాలను ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.



పట్టుబడిన నిందితులు, సారాతో పోలీసులు

మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ సీఐ అనిల్‌కుమార్

అనకాపల్లి: అక్రమంగా తరలిస్తున్న 115 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ డి.అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. పట్టణంలో వేంకటేశ్వర థియేటర్ జంక్షన్ వద్ద గల ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కె.గణేష్ సత్యకీర్తి, వేరొక మద్యం దుకాణంలో సెల్స్‌మెన్‌గా పనిచేస్తున్న జస్వంత్‌కు పట్టణంలో గవరపాలెం ప్రాంతంలో మద్యం బాటిళ్లు ఇచ్చేందుకు ద్విచక్రవాహనంపై వెళుతూ పట్టుబడినట్టు చెప్పారు. విషయం తెలుసుకున్న జస్వంత్‌కుమార్ పరారీలో ఉన్నట్టు సీఐ చెప్పారు. గణేష్ సత్యకీర్తి నుంచి 115 క్వార్టర్ బాటిళ్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేస్తున్నట్టు సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.17,500 ఉంటుందని చెప్పారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

50 మద్యం బాటిళ్లు స్వాధీనం

రోలుగుంట: నర్సీపట్నం-వడ్డాది ఆర్ అండ్ బి రోడ్డులో నిండుగొండ కూడలి అక్రమంగా మద్యం తరలిస్తున్న మహిళను పట్టుకుని, 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్‌ఐ ఎల్.సురేష్ తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గం చెట్టుపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ విక్రయించేందుకు మద్యం బాటిళ్లను సంచిలో పెట్టి తీసుకుని వెళుతూ రోలుగుంట మండలం నిండుగొండ కూడలిలో పోలీసులకు పట్టుబడింది.ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో రోలుగుంట పోలీసులు

ఆరు బాటిళ్లు స్వాధీనం

యలమంచిలి రూరల్: మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న మునగపాక మండలం రామగిరికి చెందిన చిలుకు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు చెప్పారు.నిందితుని వద్ద నుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం తెలిపారు.



పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న బుచ్చెయ్యపేట ఎస్‌ఐ ఈశ్వరరావు

తురకలపూడిలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని తురకలపూడి గ్రామంలో 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు బుధవారం రాత్రి గ్రామంలో దాడులు నిర్వహించగా గంట్ల పైడినాయుడు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించి అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

మూలపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి : గ్రామాలను దశల వారీగా అభివృద్ధి చేస్తామని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో సత్యనారాయణపురం-2 సచివాలయం మూలపేట గ్రామంలో కాలువపై వంతెన, రోడ్డు, కాలువ రక్షణ గోడ నిర్మాణానికి రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎక్కడికక్కడ అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మరోసారి మనందరి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పలక భాగ్యలక్ష్మీ సత్తిబాబు, ఎంపీటీసీ కరిమజ్జి అలివేణి మల్లేశ్వరరావు, పార్టీ గ్రామాధ్యక్షుడు చవ్వాకుల ఈశ్వరరావు, పల్లా ముత్యాలరావు, మజ్జి మహాలక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన

అనకాపల్లి: స్థానిక న్యాయస్థానాల వద్ద 46వ రోజు బుధవారం రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి లక్ష్మణ్‌సాయి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోను తక్షణమే రద్దు చేయాలని కోరారు. కొత్తపల్లి జయరాజు, రొంగలి దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.

'మెగా డీఎస్సీతో పోస్టులు భర్తీ చేయాలి'

తుమ్మపాల: డీఎస్సీలో అప్రెంటిస్ విధానం రద్దు చేసి, మెగా డీఎస్సీలో 25 వేల పోస్టులు భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలను కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసి, ఉపాధ్యాయులు లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. సమావేశంలో సీపీఐ నాయకులు బర్నికాన సాయి, వి.నరేంద్ర, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 7,876 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,780	4,690
మొదటి రకం	3,560	4,100
రెండో రకం	3,540	3,690
మూడోరకం	3,200	3,530

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	రాజా
అంబాజీపేట మ్యారేజిబ్యాండు	సత్యనారాయణస్క్రీన్-1
బూట్‌కట్ బాలరాజు	సత్యనారాయణస్క్రీన్-2
యాత్ర-2	షిర్డీసాయి
కెమెరామెన్ గంగతో రాంబాబు	పర్తిసాయి
దళారి	వెంకటేశ్వర
నా సామిరంగ	శ్రీసత్య
హనుమాన్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-7 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు, ఎ నెగిటివ్-1 యూనిట్, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరు ద్వారా సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 398 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 357 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.



'ఉపాధి'తో ఊరట

- కూలీలకు అండగా నిలుస్తున్న పథకం
- 18 ఏళ్లు పూర్తి..
- వలసలకు అడ్డుకట్ట
- కాయకష్టం చేసుకునే వారికి ఉన్న ఊళ్లోనే వెన్నుదన్ను

అనకాపల్లి (యలమంచిలి రూరల్) : వలసల నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇటు కూలీలకు, అటు పల్లెల ప్రగతికి దోహద పడుతోంది. 2006 ఫిబ్రవరి 2వ తేదీన ప్రారంభమై 18 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ పథకం ఇప్పుడు అన్ని రంగాలకు అనుసంధానమౌతోంది. దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఈ పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో ప్రారంభమైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ పథకాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సక్రమంగా అమలు చేస్తూ కూలీలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది.

ఇదీ లక్ష్యం

పేద కూలీలకు భద్రత కల్పించడంతో పాటు పస్తులు, ఆకలి చావులు, వలస సమస్యను ఎదుర్కోవడానికి ఈ పథకం ఏర్పాటైంది. శారీరక శ్రమతో కూడిన పనులు చేసేందుకు ముందుకు వచ్చే వారందరికీ ఏడాదికి 100 రోజులు పని దినాలు కల్పించడం ప్రధాన లక్ష్యం. ఖరీఫ్, రబీ సీజన్లలో వ్యవసాయ పనులు ఉన్నపుడు తప్ప మిగతా సమయాల్లో కూలీలు వలస పోకుండా ఉపాధి పనులు నియంత్రిస్తున్నాయి. ఎప్పటికప్పుడు వేతనాలను ప్రభుత్వం చెల్లిస్తుండటంతో కూలీలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

అనకాపల్లి మండలంలో ఉపాధి పనుల వివరాలు

మొత్తం జాబ్ కార్డులు	14989
పనులు పొందిన వారు	9917 (మిగిలిన కార్డులు యాక్టివ్‌లో లేవు)
ఇప్పటి వరకు 100 రోజులు పని పొందిన వారు	555
ఈ ఆర్థిక సంవత్సరం కల్పించాల్సిన పని దినాలు	5,77,711
ఈ ఆర్థిక సంవత్సరంలో లేబర్ బడ్జెట్	రూ.15.71 కోట్లు



అనకాపల్లి మండలం తగరంపూడిలో సాగు చేసిన మామిడి తోట

అక్రమాలకు చెక్..

ఈ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం జాబ్‌కార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానం చేసింది. దీంతో పనికి వచ్చిన ప్రతి ఒక్కరిని సిబ్బంది ఫొటో తీసి ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ పథకం అమల్లోకి రాక ముందు రోజు కూలీ రూ.20 మాత్రమే ఉండేది. ఈ చట్టం వచ్చాక కూలీల వేతనం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం అది రూ.272కు చేరింది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



మామిడిపాలెంలో పనుల కోసం వచ్చిన కూలీలు

వలసల బాధ తప్పింది..



ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయకుంటే మాలాంటి వారికి ఎన్నో ఇబ్బందులు ఉండేవి. వ్యవసాయ పనులు లేనపుడు ఉపాధి పనులు ఆదుకుంటున్నాయి. వలస వెళ్లకుండా ఉన్న గ్రామంలో పనులు చేసుకునేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతోంది. ఒక కుటుంబంలో నలుగురు పనికి వెళితే కూలీ బాగా గిట్టుబాటు అవుతోంది.

– ఎం. వరలక్ష్మి, ఉపాధి కూలీ, మామిడిపాలెం

పేదలకు వరం..



నిరుపేద కుటుంబాలకు ఉపాధి హామీ పథకం వరం లాంటిది. కచ్చితంగా పని కల్పిస్తూ ప్రభుత్వం ఆదుకుంటోంది. ఉన్న ఊర్లోనే పనులు చేసుకోవడానికి వీలు పడుతోంది. ఇతర ప్రాంతాలకు పనుల కోసం వెళ్లాల్సిన అవసరం తప్పింది. మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పనులు ముమ్మరంగా జరుగుతాయి. అందుచేత వేసవిలో కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు. ఇటీవల గ్రామాల్లో మొక్కలు నాటే పనులు మొదలుపెట్టి మాకు పని కల్పించారు.

– అల్లు లక్ష్మి, ఉపాధి కూలీ, మామిడిపాలెం

శ్రమజీవులకు ఊతం..



ఉపాధి హామీ పథకం సామాన్య ప్రజల జీవనోపాధికి వరంగా మారింది. వ్యవసాయ పనులు లేని సమయంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉపాధి హామీ పనులు కల్పించి శ్రమ జీవులను ఆదుకుంటున్నాం. జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఉన్న గ్రామంలోనే పనులు కల్పిస్తున్నాం.

– పీవీఎస్‌ఆర్‌జీ సుప్రియ, ఏపీవో, అనకాపల్లి

నేటి నుంచి యోగాలో శిక్షణ

అనకాపల్లి : స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకూ ఉదయం, సాయంత్రం వేళల్లో భారత స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ జిల్లా మహిళా పతంజలి యోగ అధ్యక్షులు, యోగా నిపుణులు ప్రభా సాహో విచ్చేస్తారని దొరమనాయుడు పేర్కొన్నారు.

'వైఎస్సార్ ఆసరా' పంపిణీ నేడు

అనకాపల్లి : జీవీఎంసీ పట్టణ పరిధిలో 4వ విడత 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమం గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. జీవీఎంసీ పరిధిలో అర్హులైన అక్కచెల్లెమ్మలు హాజరు కావాలన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



బండిప్రభను ప్రతిష్టిస్తున్న భక్తులు

రోలుగుంట: బండి ప్రభ ప్రతిష్టతో నాలుగు రోజుల పాటు నిర్వహించే గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు బుధవారం రోలుగుంటలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు యువకులు పగటి వేషాలను ప్రదర్శించారు. సాయంత్రం వెదురు కలపతో సిద్ధం చేసిన 90 అడుగుల నిడివి గల బండి ప్రభను పోలిరెడ్డి నర్సింహమూర్తి ఇంటి వద్ద నుంచి మున్సిబ్ వర్గీయులు భుజాల మీద తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అదే సమయంలో ఇక్కడ భజనలు, కోలాటాల ప్రదర్శనలతో ఉత్సవాల సందడి సంతరించుకుంది.

ప్రజల చెంతకే వైద్య సేవలు

- జగనన్న ఆరోగ్య సురక్షలో 331 మందికి వైద్య సేవలు
- ఎన్టీఆర్ వైద్యాలయానికి ఐదుగురు, కంటి శస్త్ర చికిత్సలకు 12 మంది ఎంపిక



రోగికి మందులు అందజేస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి



రోగికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు



బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి స్థానికుల నుంచి అనూహ్య స్పందన వస్తోందని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. స్థానిక వేల్పులవీధి సచివాలయం-7 పరిధిలోని ఇంద్రద్యుమ్న హాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో రోగాల బారిన పడిన ప్రజలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టు తిరిగే వారన్నారు. నేడు ప్రజల వద్దకే ఆరోగ్యం అనే కార్యక్రమాన్ని జగనన్న ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. సచివాలయాల పరిధిలో రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలో 4 కొత్త యూపీహెచ్‌సీలు ఏర్పాటు చేసి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్ల ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో ఇద్దరు జనరల్ ఫిజీషియన్లు, ఒక గైనకాలజిస్టు, కంటి వైద్యురాలు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 331 మందికి పరీక్షలు చేయగా, ఐదుగురుని ఎన్టీఆర్ వైద్యలయానికి, 12 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యులు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ అయ్యప్పనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు, పట్టణ ఉపాధ్యక్షుడు మద్దాల రమణబాబు, ప్రధాన కార్యదర్శి నడిశెట్టి మధు, ఏఎన్‌ఎంలు పంపాన స్వప్న, జ్యోతి, ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, రోగులు పాల్గొన్నారు.



రోగితో మాట్లాడుతున్న వైద్యురాలు



బీపీ చెక్ చేయించుకుంటున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

కంటి వైద్యం చేయించుకున్నాను..



సుమారు 2 మాసాలుగా కంటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాను. నా సమస్యను వలంటీర్‌కు తెలియజేశాను. జగనన్న సురక్షలో కంటి పరీక్ష చేసి ఉచితంగా ఆపరేషన్ చేయడంతో పాటు మందులు ఇస్తారని తెలిపారు. దాంతో సురక్షలో కంటి పరీక్ష చేయించుకోగా అద్దాలు రాసిచ్చారు. వయస్సును బట్టి కంటి సమస్య వస్తుందని వైద్యులు చెప్పి, ఎక్కువగా ఆకుకూరలు వాడమన్నారు.

– షేక్‌బాజీ, అనకాపల్లి.

టిడ్కో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు పత్రాలను అందిస్తున్న మలసాల భరత్‌కుమార్



సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

అనకాపల్లి: పేదల సొంతింటి కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోనే నెరవేరుతోందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. స్థానిక 84వ వార్డు కోట్నివీధి కల్యాణ మండపంలో 10,11,12 సచివాలయాల పరిధిలో 300 మంది టిడ్కో గృహాల లబ్ధిదారులకు బుధవారం రిజిస్ట్రేషన్ పత్రాలను, తాళం కప్పలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ స్థలంలో గృహాలు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. పట్టణ, మండల పరిధిలో సుమారుగా 5వేల మందికి టిడ్కో గృహాలను అందజేస్తున్నట్లు చెప్పారు. గృహాల్లో నివసించే వారికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నాయకులు ఏడువాకల నారాయణరావు, డాక్టర్ యశ్వంత్, మలసాల కుమార్ రాజా, ఉగ్గిన అప్పారావు, కోట్ని శ్రీనివాసరావు, కోరుకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెల్లవారినా తెరలు వీడని మంచు

తెల్లవారినా కశింకోట ప్రాంతంలో మంచు తెరలు వీడలేదు. బుధవారం ఉదయం 8 గంటలైనా దినకరుడు కానరాలేదు. గ్రామంలోని ఇళ్లు, చెట్లు మంచు దుప్పటిని కప్పుకునే ఉన్నాయి. శారదానది అవతల ఉన్న పొలాలకు వెళ్లే రహదారుల్లోనూ పొగ మంచు దట్టంగా కమ్ముకోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. తాళ్లపాలెం వారపు సంత ప్రాంతంలోనూ పొగమంచు కమ్ముకోవడంతో నర్సీపట్నం వైపు వెళ్లే వాహన చోదకులకు అవస్థలు తప్పలేదు. - కశింకోట



కశింకోటలో శారదా నదిపై దట్టంగా ఆవహించిన మంచు



కశింకోట వద్ద ఇళ్లు,చెట్లపై కమ్ముకున్న పొగ మంచు



సూర్యుడిని కప్పేసిన పొగమంచు

విద్యార్థి దశ నుంచి దైవభక్తి పెంచుకోవాలి

అనకాపల్లి: విద్యార్థులు దైవభక్తిని పెంపొందించుకోవాలని భారత్ వికాస్ పరిషత్ పట్టణ అధ్యక్షుడు ఆళ్ల ఓంరామ్, కన్వీనర్ వై.కేశవరావు సూచించారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వికాస్ సప్తాహ్‌లో భాగంగా మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో అన్నమయ్య సంకీర్తనల ఆలాపన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల్లో ప్రథమ బహుమతిని ఎం.వి.హర్షిణి, ద్వితీయ బహుమతిని ఎం.భాస్య, తృతీయ బహుమతిని ఐ.భావనా రుషికుమార్ గెలుచుకున్నారు. మరో ముగ్గురు విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పరిషత్ కో కన్వీనర్ చదరం కోటేశ్వరరావు, ప్రోగ్రాం కన్వీనర్ సాన త్రినాథ్‌రావు, పరిషత్ కార్యదర్శి ఎన్.ఎ.బి.వర్మ, కోశాధికారి డి.శివరాము తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో పరిషత్ అధ్యక్షుడు ఆళ్ల ఓంరామ్, సభ్యులు

లారీ ఢీకొని గేదెలు మృతి

అనకాపల్లి: లారీ ఢీకొన్న ఘటనలో గవరపాలేనికి చెందిన పాడిరైతు కర్రి సన్యాసినాయుడికి చెందిన రెండు గేదెలు మృతి చెందాయి, మరో రెండు ఆవులు గాయపడ్డాయి. విశాఖ-అనకాపల్లి జాతీయ రహదారి జలగలమదుం జంక్షన్ వద్ద బుధవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు -2 వేగి త్రినాథ్ ఘటనాస్థలికి చేరుకున్నారు. లారీ డ్రైవర్‌తో మాట్లాడి బాధిత రైతుకు రూ.90వేలు పరిహారం ఇప్పించారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి

కశింకోట : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని, సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రచారం చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. నూతలగుంటపాలెం, నరసింగబిల్లి, చింతలపాలెం గ్రామాలను బుధవారం సందర్శించారు. కోన నాగేశ్వరరావు, కలిగెట్ల నాయుడు, సర్పంచ్ రాము పాల్గొన్నారు.

'ప్రత్యేక హోదాపై కేంద్రం వంకలు హాస్యాస్పదం'

అనకాపల్లి: విభజన చట్టంలో ప్రత్యేక హోదాను పొందుపరచలేదని ఇప్పుడు కేంద్రం వంకలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి రాష్ట్ర సహాయక కార్యదర్శి కనిశెట్టి సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విభజన సమయంలో ప్రతిపక్ష పార్టీగా ఉన్న బీజేపీ ఐదేళ్లు కాదు.. పదేళ్లు ప్రత్యేక హోదా కావాలని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజానీకాన్ని తప్పుదోవ పట్టించడం బీజేపీ ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్యగా మారిందని విమర్శించారు. అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, ప్రజలు ఐక్యంగా పోరాడితేనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోగలమని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాను అమలు చేస్తామని రాహుల్ గాంధీ చెప్పడం ఏమిటని ప్రశ్నించారు.

అతిగా మద్యం సేవించి యువకుడి మృతి

కశింకోట : స్థానికరైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల పక్కన మద్యం మత్తులో యువకుడు బుధవారం సాయంత్రం మృతి చెందాడు. స్థానిక కస్పావీధి ప్రాంతానికి చెందిన ధర్మిశెట్టి మోహన్ (26) మరో స్నేహితునితో కలిసి వెళ్లి మద్యం సేవించాడు. అనంతరం వారు రైల్వే పట్టాలకు కొద్దిపాటి దూరంలో సేద తీరారు. ఈ నేపథ్యంలో మోహన్ అక్కడ మృతి చెందాడు. స్నేహితుడు మోహన్‌ను ఎంత పిలిచినా ఉలుకు పలుకు లేకపోవడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అతిగా మద్యం సేవించడం వల్ల మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

నేడు జిల్లా స్థాయి గుర్రప్పందాలు

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో జిల్లా స్థాయి గుర్రం, ఎడ్లబళ్ల పరుగు పందాలు ఏర్పాటు చేశామన్నారు.